తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT
ఎడిటర్: బక్క రవీందర్
శనివారం 17, ఆగస్టు 2024

## శంకర్‌పల్లిలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం


2లో

**సమస్య ఏదైనా**

దాని వెనుక ఎవరున్నా....
నిజాన్ని నిభయంగా చూపిస్తాం
మీకు తెలిసిన ప్రజల సమస్యలు
మాకు తెలియజేయండి.
ఇండిపెండెంట్ జర్నలిజానికి
వేదిక.. మీ డైలీ రిపోర్ట్
ఫోన్ నెంబర్
8501919707



- కేసీఆర్‌కు గవర్నర్, కేటీఆర్ కు కేంద్ర మంత్రి పదవులు: రేవంత్ రెడ్డి
- కవితకు బెయిల్ పక్కా
- బిజెపిలో బిఆర్ఎస్ విలీనం తథ్యం
- రేవంత్ సంచలన వ్యాఖ్యాలు
- మంత్రి వర్గ విస్తరణపై చర్చలు
- త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తా..
- ఇండస్ట్రీ, సర్వీస్ రంగాల్లో విస్తరించే సత్తా గల నగర
- ఫోర్త్ సిటీ ఏర్పాటులో మీ విజన్ అద్భుతం
- హైదరాబాద్‌లో పెట్టుబడులకు సానుకూలత



# బీజేపీలో బీఆర్ఎస్ విలీనం..

**ఢిల్లీ:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందని చెప్పారు. కేసీఆర్ కు గవర్నర్ పదవి, కేటీఆర్ కు కేంద్ర మంత్రి పదవిని బీజేపీ ఇస్తుందని తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా హరీశ్ రావు నియమితులవుతారని చెప్పారు. లిక్కర్ స్కామ్ లో ఉన్న కవితకు బెయిల్ కూడా వస్తుందని విలీనంలో భాగంగా ఆమెను రాజ్యసభకు పంపుతారని అన్నారు. ఇప్పుడు తన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు ఖండించినా అది ఎప్పటికైనా విలీనం తథ్యమన్నారు.. అదేవిధంగా బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీలు బీజేపీలో విలీనమయ్యే అవకాశం ఉందని రేవంత్ వ్యాఖ్యానించారు.

అలాగే ఫాక్స్ కాన్ సంస్థ ప్రతినిధులు హైదరాబాద్ రానునట్లు చెప్పారు రేవంత్. ఇక ఖర్గే అపాయింట్ మెంట్ కోరామని, ఆయనను కలుస్తామని తెలిపారు.. ఇక రైతు రుణమాఫీ కి 5 వేల కోట్ల రిజర్వ్ నిధులు ఉంచామన్నారు. రుణమాఫీ కాని వారు కలెక్టరేట్ కి వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఒకే కుటుంబంలో వారికి 2 లక్షలకు పైగా రుణం ఉంటే వారిని ఒక యూనిట్ గా పరిగణించి 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని వివరించారు.. తన మార్క్ ఉండాలనే ఆగస్టు 15 వరకు రుణమాఫీ తేదీ ప్రకటించామన్నారు.. కేంద్ర బడ్జెట్ పై రేవంత్ మాట్లాడుతూ, తెలంగాణ ఒక్క పైసా కూడా రాలేదని మండి పడ్డారు.

**రేవంత్ తో మను సింఘ్వీ భేటీ...**

అంతకు ముందు . సీఎం ఇవాళ కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ కలిశారు. రాష్ట్రం నుంచి ఆయన రాజ్యసభకు వెళ్లనున్న సంగతి తెలిసిందే. తెలంగాణ నుంచి రాజ్యసభకు అవకాశం కల్పించడం గౌరవంగా భావిస్తున్నానని సందర్భంగా అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు.

సీఎం ఒకటి రెండు రోజులపాటు ఢిల్లీలో ఉండే అవకాశం ఉంది. పార్టీలో తాజా పరిణామాలు, కొత్త పీసీసీ చీఫ్, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవులపై పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్‌లతో చర్చించనున్నారు. మరోవైపు రైతు రుణమాఫీ అంశాన్ని రాహుల్ గాంధీకి రేవంత్ వివరించనున్నారు. వరంగల్‌లో జరిగే రైతు కృతజ్ఞత సభకు రాహుల్ గాంధీని సీఎం ఆహ్వానించనున్నారు. రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సోనియాను ఆహ్వానించనున్నట్లు సమాచారం..

ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్లతో పాటు అన్ని రంగాల్లో విస్తరించే సత్తా హైదరాబాద్ నగరానికి ఉందని అంతర్జాతీయ దిగ్గజ పారిశ్రామిక సంస్థ ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ అన్నారు. త్వరలోనే తన బృందంతో కలిసి హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తానని ఆయన తెలిపారు.

ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ నేతృత్వంలోని ఫాక్స్ కాన్ ప్రతినిధి బృందం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన అధికారిక నివాసంలో శుక్రవారం ఉదయం సమావేశమైంది. హైదరాబాద్ నగరానికి ఉన్న చరిత్ర.. పారిశ్రామిక సంస్థల విస్తరణకు ఉన్న అనుకూలత, అద్భుతమైన వాతావరణ పరిస్థితులను రేవంత్ ఫాక్స్ కాన్

మిగతా 2లో

# అదే నిజమైతే రాజీనామా చేస్తా..



- మీ నియోజకవర్గానికే వెళ్దాం
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- సెక్యూరిటీ లేకుండా బయటకు రండి
- ప్రజలే మిమ్మల్ని ఫుట్ బాల్ ఆడతారు
- 30శాతం రుణ మాఫీ చేసి వంద శాతం అంటారా?
- ఇంత పచ్చి మోసం, దగా చేయడం మీకే చెల్లింది
- తెలంగాణ భవన్‌లో మీడియా మీట్..
- విరుచుకుపడ్డ కేటీ రామారావు

**హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రుణమాఫీ పైన సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. తెలంగాణ భవన్ లో కేటీఆర్, ఇతర సీనియర్ పార్టీ నేతలు నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ.. మీరు చేసిన రుణమాఫీ నిజమైతే.. మీ నియోజకవర్గం కొడంగల్ కు మీడియాతో కలిసి వెళ్దామన్నారు. రుణమాఫీపై ఆయన చెప్పింది నిజమని, 100 శాతం రుణమాఫీ అయిందని రైతులు చెబితే తాను పదవికి రాజీనామా చేసి, రాజకీయాలు వదిలేస్తానని సవాల్ చేశారు. ఏదైనా ఒక్క రైతు వేదికలో 100 శాతం రుణమాఫీ అయినట్లు చెప్పించగలరా? అని ప్రశ్నించారు. . సీఎంకు దమ్ముంటే తన సవాల్ ను స్వీకరించాలని ఛాలెంజ్ చేస్తున్నానన్నారు. ప్రతి నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు తిరిగి%ొ%. ఎంతమందికి రుణమాఫీ అయిందో వెలికి తీస్తారన్నారు. రైతు రుణమాఫీ పేరుతో మోసం చేశారని ఆరోపించారు. రుణమాఫీని గత ఏడాది డిసెంబర్ 9 నుంచి ఆగస్ట్ 15 వరకు జాప్యం చేశారన్నారు. రుణమాఫీకి సంబంధించి బ్యాంకులకు 9 నెలల వడ్డీని ఎవరు కడతారో చెప్పాలని నిలదీశారు. 22.37 లక్షల మంది రైతులకు%ొ% రూ.17,934 కోట్ల రుణమాఫీ మాత్రమే చేశారన్నారు. రుణమాఫీ 40 శాతం మాత్రమే అయిందన్నారు. అరవై శాతం మందికి రుణమాఫీ ఎగ్గొట్టారన్నారు. రుణమాఫీలో అనేక కోతలు పెట్టారన్నారు. సీఎం అంటే కటింగ్ మాస్టర్‌లా తయారయ్యాడని ఎద్దేవా చేశారు. రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు రుణమాఫీకి కొర్రీలు చెప్పని కాంగ్రెస్ ఇప్పుడు మాత్రం ఎన్నో కొర్రీలు పెడుతోందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ మోసం కేసీఆర్‌పై ద్వేషం.. ఇదే ఈ ప్రభుత్వం తీరు అన్నారు. రుణమాఫీ, ఉద్యోగాలు, ఆడపడుచులకు తులం బంగారం, నెలకు రూ.2500, విద్యార్థులకు

మిగతా 2లో



## హైదరాబాద్‌లో భారీ వర్షం..


- రెడ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షం
- హైదరాబాద్‌లో డ్రైనేజీ పొంగి రోడ్డు మీదకు వచ్చిన నీరు

**హైదరాబాద్:** వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయి వాహనదారుల ఇబ్బందులుహైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది. నగరంతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షం కురుస్తోంది. సికింద్రాబాద్, తిరుమలగిరి, బొల్లారం, ప్యారడైజ్, బేగంపేట, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మేడ్చల్, కండ్లకోయ, దుండిగల్, గండి మైసమ్మ, మియాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, బాలానగర్, కోఠి, ఆబిడ్స్, హిమాయత్ నగర్, చిక్కడపల్లి తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.ఢభారీ వర్షంతో హైదరాబాద్ నగరంలోని చాలా రోడ్లు నీటితో నిండిపోయాయి. కొన్నిచోట్ల డ్రైనేజీలు పొంగి రోడ్డు మీదకు మురుగు నీరు వచ్చింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చాలాచోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. గచ్చిబౌలి, అమీర్‌పేట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, బయోడైవర్సిటీ క్రాస్ వద్ద వాహనాలు బారులుతీరాయి. ఈరోజు రాత్రి... మరికొన్ని గంటల్లో నగరంలో కుండపోత వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు నగరవాసులకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. అత్యవసర పరిస్థితుల్లో 040-21111111కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు

మిగతా 2లో

### ఇస్రో మరో ఘనత.. నిప్పులు చిమ్ముతూ నింగిలోకి
# దూసుకెళ్లిన ఎస్ఎస్ఎల్వీ డీ3

- ఎస్ఎస్ఎల్వీ డీ3 ద్వారా ఈవోఎస్-08 శాటిలైట్ ను పంపిన ఇస్రో
- విపత్తుల సమయంలో కీలక సమాచారాన్ని పంపనున్న ఉపగ్రహం
- ఏడాది పాటు పని చేయనున్న శాటిలైట్



**శ్రీహరికోట:** వరుస విజయాలతో దూసుకెళుతున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో ఘనతను సాధించింది. శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఎస్ఎస్ఎల్వీ డీ3ని విజయవంతంగా నింగిలోకి పంపింది. ఈ రాకెట్ ద్వారా 175 కిలోల ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. విపత్తుల సమయంలో ఈ ఉపగ్రహం కీలక సమాచారాన్ని పంపిస్తుంది. ప్రకృతి విపత్తులతో పాటు అగ్ని పర్వతాలను కూడా ఈ శాటిలైట్ పర్యవేక్షిస్తుంది. మొత్తం 17 నిమిషాల పాటు రాకెట్ ప్రయోగం కొనసాగింది. ఈవోఎస్ శాటిలైట్ ను యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ లో అభివృద్ధి చేశారు. ఈ ఉపగ్రహంలో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్ఫ్రారెడ్ పేలోడ్ మిడ్ వేవ్, లాంగ్ వేవ్ ఇన్ఫ్రారెడ్ లో చిత్రాలను తీస్తుంది. ఈ శాటిలైట్ పంపించే సమాచారం విపత్తు నిర్వహణలో ఎంతో ఉపయోగపడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ఉపగ్రహం ఏడాది పాటు పని చేస్తుంది.వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శుక్రవారం మరొక ఘనత సాధించింది. శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష కేంద్రం

మిగతా 2లో

### మానవాళికి ముప్పుగా మరో వైరస్..
## విస్తరిస్తున్న 'మంకీపాక్స్'

- బుష్ ఎనిమల్‌లో బయటపడ్డ వైరస్
- తొలినాళ్లలో ఆఫ్రికా ఖండానికే పరిమితం
- 2022లో వివిధ దేశాలలో బయటపడ్డ కేసులు
- తాజాగా పాకిస్థాన్ లో ఓ వ్యక్తికి సోకిన మంకీపాక్స్



2

# ఎంఎల్‌సిలుగా కోదండరామ్, ఆమెర్ ప్రమాణ స్వీకారం



**హైదరాబాద్:** ఎమ్మెల్సీలుగా టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిస్ట్ జఅమీర్ అలీఖాన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధిస్తూ తీర్పును వెలువరించింది. దీంతో ఎమ్మెల్సీల నియామకంపై ఎట్టకేలకు వివాదానికి తెరపడింది. ఈ మేరకు శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తన ఛాంబర్‌లో వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎమ్మెల్సీ మహేష్ కూమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో

మిగతా 2లో

## బంగ్లాదేశ్‌లో హిందువులకు భద్రత కల్పిస్తాం : ప్రధాని మోడీ

- బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిణామాలపై ఇద్దరం మాట్లాడుకున్నామన్న మోదీ
- హిందువులకు భద్రత కల్పిస్తామని యూనస్ హామీ ఇచ్చారని వెల్లడి
- శాంతియుత ప్రభుత్వానికి భారత్ మద్దతు ఉంటుందన్న ప్రధాని



**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లోని మైనార్టీలపై హింసాత్మక దాడులు కొనసాగుతుండటంపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఆ దేశంలో ప్రస్తుతం రాజకీయ అస్థిరత్వం కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రధాని మోదీకి ఆ దేశ తాత్కాలిక పాలకుడు మహమ్మద్ యూనస్ ఫోన్ కాల్ చేశారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా మోదీ వెల్లడించారు. బంగ్లాదేశ్ లో ప్రస్తుత పరిణామాలపై ఇద్దరం మాట్లాడుకున్నామని మోదీ వెల్లడించారు. ఆ దేశంలోని హిందువులు, మైనార్టీలకు భద్రత కల్పిస్తామని మహమ్మద్ యూనస్ హామీ ఇచ్చారని తెలిపారు. శాంతియుత, సుస్థిర, ప్రగతిశీల ప్రభుత్వానికి భారత్ మద్దతు ఉంటుందని చెప్పారు. మరోవైపు నిన్న స్వాతంత్ర్యదినోత్సవ వేడుక సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ... బంగ్లాదేశ్ లో మైనార్టీలైన హిందువుల భద్రత విషయంలో 140 కోట్ల మంది భారతీయులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. అక్కడ ఉన్న హిందువులు, మైనార్టీల భద్రతను భారత్ కోరుకుంటోందని తెలిపారు. యూనస్ కూడా ఇటీవల స్పందిస్తూ... మానవులంతా ఒక్కటేనని, హక్కులు అందరికీ సమానమేనని చెప్పారు. మతం ఏదైనా, ప్రజాస్వామ్యంలో

మిగతా 2లో

# బీజేపీలో బీఆర్ఎస్ విలీనం..

బృందానికి వివరించారు. 430 ఏళ్ల కింద పునాది రాయి పడిన హైదరాబాద్ కాలక్రమంలో మూడు నగరాలుగా అభివృద్ధి చెందిన తీరును తెలియజేశారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక అభివృద్ధిలో వైరుధ్యాలు లేకపోవడంతోనే హైదరాబాద్ వేగంగా పురోగతి చెందుతోందన్నారు.. ఆ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్లు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని వివరించారు. ఫోర్త్ సిటీలో విద్యా, వైద్యం, క్రీడా, ఎలక్ట్రానిక్స్–ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇలా బహుముఖంగా అభివృద్ధి చేయనున్నామని చెప్పారు.

ప్రస్తుత ప్రపంచానికి అవసరమైన స్కిల్స్‌ను యువతకు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామన్నారు. నవ తరం పరిశ్రమల అవసరాలు, వాటికి అవసరమైన నైపుణ్యాలు, భవిష్యత్తులో ఆయా పరిశ్రమల అవసరాలు తీర్చే మానవ వనరులను అందించేందుకు అవసరమైన సిలబస్ రూపకల్పనలో ప్రముఖ పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే స్కిల్ యూనివర్సిటీకి ఆనంద్ మహేంద్రను ఛైర్మన్‌గా, మరో పారిశ్రామిక వేత్త శ్రీనివాస రాజును వైస్ ఛైర్మన్‌గా నియమించామని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్)తో పాటు హైదరాబాద్‌కు ఉన్న అన్ని అనుకూలతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి వివరించారు. ఫోర్త్ సిటీలో ఫాక్స్ కాన్ సంస్థ పరిశ్రమలు పెట్టేందుకు అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వడంతో పాటు అవసరమైన మద్దతు అందజేస్తామని ముఖ్యమంత్రి ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూకి హామీ ఇచ్చారు. ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ బృందం అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించి దిగ్గజ పారిశ్రామిక సంస్థలతో జరిపిన చర్చలు, చేసుకున్న ఒప్పందాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఛైర్మన్ యాంగ్ లియూకి వివరించారు. ఫోర్త్ సిటీ రూపకల్పనలో ముఖ్యమంత్రి దార్శనికత, పారిశ్రామిక అనుకూల విధానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ అన్నారు. ఫోర్త్ సిటీతో పాటు పారిశ్రామిక అనుకూల విధానాల్లో మీ విజన్ అద్భుతంగా ఉందంటూ యాంగ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.

తాను సాధ్యమైనంత త్వరలోనే హైదరాబాద్ ను సందర్శిస్తానని తెలిపారు. అంతకుముందే తమ చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్ , సంస్థ భారత దేశ ప్రతినిధి వీ లీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్ వస్తుందని ఆయన చెప్పారు.

ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) జయేష్ రంజన్, ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ ఎక్సటర్నల్ ఎంగేజ్‌మెంట్), ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ డాక్టర్ ఎస్కే శర్మ, ఫాక్స్ కాన్ నుంచి సంస్థ ఎస్బీజీ ప్రెసిడెంట్ బాబ్ చెన్ , సీబీజీ జీఎం జొ వూ , చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్ , సీఎస్బీజీ డిప్యూటీ జీఎం సూ, షో కూ , సీ–గ్రూప్ మేనేజర్ సైమన్ సంగ్ , సంస్థ భారత దేశ ప్రతినిధి వీ లీ తదితరులు పాల్గొన్నారు.

# అదే నిజమైతే రాజీనామా చేస్తా..

రూ.5 లక్షల భరోసా కార్డు, జాబ్ క్యాలెండర్, దళితులకు రూ.12 లక్షలు, ఆటో అన్నలకు ఏడాదికి రూ.12 వేలు, రైతు కూలీలకు నెలకు రూ.1000.. ఇలా అన్నింటా మోసమే చేశారన్నారు. ఏకకాలంలో రుణమాఫీ అని ఎవరైనా మూడుసార్లు ప్రకటన చేస్తారా? ఏదో పాత గోడకు కొత్త సున్నం అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఏకకాలంలో అంటే ఒకేసారి చేయాలి... ఒకేసారి ప్రకటన ఇవ్వాలన్నారు. అయినా ముఖ్యమంత్రికి పాత గోడకు కొత్త సున్నం వేసిన అనుభవం ఉన్నట్లుగా ఉందని సెటైర్ వేశారు. రేవంత్ రెడ్డి అడ్డమైన ఫీట్లు చూసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు కూడా ఈ మోసాలను చూసి ఆశ్చర్యపోతున్నారన్నారు.రాష్ట్రం లో రైతు రుణమాఫీ 40 శాతం మాత్రమే చేశారని బిఆర్ఎస్ క్యార్యనిర్వాహక అ ధ్యక్షుడు, మాజీ మంత్రి కెటిఆర్ ఆరోపించారు.

తెలంగాణ భవన్‌లో కెటిఆర్, ఇతర సీనియర్ పార్టీ నేతలు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ రుణమాఫీలో సవాలక్ష కొ ర్రీలు, ఆంక్షలు పెట్టారని, రైతు రుణమా ఫీ పేరుతో ప్రజలను మోసం చేశారని ఆ యన ధ్వజ మెత్తారు. రైతు రుణమాఫీ పైన తాను సిఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నట్లు వెల్లడించారు.

ఒకవేళ సిఎం రేవంత్‌రెడ్డి చేసిన రుణమాఫీ నిజమైతే, కొడంగల్ నియోజకవర్గానికే మీడియాతో కలిసి వెళ్దామన్నారు. ఒక్క రైతు వేదికలోనైనా వంద శాతం రుణమాఫీ జ రిగిందని ఒక్క రైతు చెప్పినా తాను రాజకీయాలను వదిలేస్తానని కెటిఆర్ సవాల్ విసిరారు.

సిఎంకు దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించాలని ఛాలెంజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. రుణమాఫీలో డిసెంబ రు 9 నుంచి ఆగస్టు 15 వరకు జాప్యం చేశారని పేర్కొన్నారు.

బ్యాంకు లకు 9 నెలల వడ్డీ ఎవరు కడతారు? అని ప్ర శ్నించారు. 22.37 లక్షల మంది రైతులకు రూ.17,934 కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని వెల్లడించారు. తాము ఉ న్నప్పుడు రుణమాఫీ చేశామని, రైతుబంధు వేశామన్నారు. వర్షాకాలం రైతుభరోసా రూ.14 వేల కోట్లు ఇంకా ఇవ్వలేదని, మొన్న యాసంగిలో రూ.4 వేల కోట్ల రైతు ఎగ్గొట్టారని మండిపడ్డారు.

వైరాలో రేవంత్‌రెడ్డి ప్రసంగం విచిత్రంగా ఉందని పేర్కొన్నారు. రుణమాఫీ సగం కూడా చేయకుండా సంపూర్ణంగా చేశామనడం మోసమని ఆయన మండిపడ్డారు.

రేవంత్‌రెడ్డి సెక్యూరిటీ, అధికారులు లేకుండా గ్రామాలకు వెళ్తే రైతులే కొడతారని ఆయన వ్యాఖ్యనించారు.

హరీశ్‌రావు రాజీనామా చేయాలని చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, వందశాతం రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తామని హరీశ్‌రావు అన్నారని గుర్తు చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి విజన్ లేదు, విధానం లేదని ఆరోపించారు. రైతు రుణమాఫీపై బిఆర్ఎస్ పార్టీ హెల్ప్‌లైన్ పెట్టిందన్నారు. ఇప్పటివరకు లక్ష ఫిర్యాదులు వచ్చాయని, నేటి నుంచి రైతుల వద్దకు వెళ్లి ప్రభుత్వ మోసాన్ని ఎండగడతా మన్నారు. సెప్టెంబర్ నెలలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి ప్రాంతీయ పార్టీల నేతలను కలుస్తామన్నారు. మాకు ఇదే మొదటిసారి ప్రతిపక్ష పాత్ర అని అన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం..

కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.రాగల 24గంటల్లో ఉరుములు మెరుపులతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నట్లు తెలిపింది.గంటకు 40కిలోమీటర్ల వేగంతోకూడిన బలమైన గాలులు వీయనున్నట్టు తెలిపింది. ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు వారద్దని అధికారులు హెచ్చరించారు. అదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదివారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపరి ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో గాలులు వీయనున్నట్లు తెలిపింది. ప్రజలు అవసరమైతే తప్ప బయటికి రావద్దని అధికారులు సూచించారు.రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కమ్ముకున్న మబ్బులతో గ్రేటర్ హదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, పలు ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు వరద నీటితో మునిగిపోయాయి.ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్థంబించి పోయింది. ప్రజలు రోడ్లపై వాహనాలు నడిపేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గత కొన్ని రోజులుగా నెలకొన్న ఎండ వేడిమికి ఉపశమనం లభించింది. ఎండల ధాటికి వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఈ వర్షాలు కాస్త ఉపశమనం కలిగించాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గంగాధర, రామడుగు, చొప్పదండి, ధర్మపురి, చిగురు మామిడి, బోయినపల్లి తదితర మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో అక్కడ విద్యుత్ సరఫరాకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. రెండు గంటల పాటు ఏకధాటిగా భారీ వర్షం కురవడంతో అన్నదాతల్లో ఆనందం నెలకొంది. కొన్ని చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మరోవైపు సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గత కొంతకాలం నుంచి వర్షాలు లేక ఎండు ముఖం పట్టిన పత్తి, మొక్కజొన్న పంటలకు జీవం పోసినట్లయింది. వర్షం పడడంతో రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మానవాళికి ముప్పుగా మరో వైరస్..

# విస్తరిస్తున్న 'మంకీపాక్స్'

ప్రపంచాన్ని వణికించిన కొవిడ్ మహమ్మారి బెడద ప్రస్తుతం సద్దుమణిగింది. ఇటీవలి పారిస్ ఒలింపిక్స్ నేపథ్యంలో కేసులు పెరిగినప్పటికీ పెద్దగా ప్రమాదకరం కాదని వైద్యులు తేల్చిచెప్పారు. అయితే, కొవిడ్ తర్వాత అలాంటి మరో మహమ్మారి మానవాళికి ముప్పుగా పరిణమించనుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ వో) తాజాగా హెచ్చరికలు జారీ చేసింది. ఎంపాక్స్ గా వ్యవహరించే మంకీపాక్స్ వైరస్ ప్రపంచ దేశాలకు విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఆఫ్రికా ఖండానికే పరిమితమైన ఈ వైరస్ 2022 లో ప్రపంచ దేశాలకు పాకిన విషయాన్ని గుర్తుచేస్తోంది.

మరోమారు ఈ వైరస్ విస్తరిస్తోందని, ఈసారి మరింత ప్రమాదకరంగా మారే డేంజర్ పొంచి ఉందని తెలిపింది. ఆఫ్రికా దేశాలతో పాటు పాకిస్థాన్ సహా మరికొన్ని దేశాలలో వైరస్ కేసులు గుర్తించనట్లు డబ్ల్యూహెచ్ వో ప్రకటించింది. మంకీపాక్స్ వైరస్ ను ఎంపాక్స్ గా శాస్త్రవేత్తలు వ్యవహరిస్తున్నారు. ఇది సోకిన మనుషుల శరీరంపై చిన్న చిన్న పొక్కులు (అమ్మవారు సోకినట్లు) ఏర్పడతాయి. స్మాల్ పాక్స్ లక్షణాలు కనిపిస్తాయి.ఆఫ్రికా ఖండంలో 1958లో ఈ వైరస్ ను గుర్తించారు. 1970 లలో ఈ వైరస్ జంతువులలో, వాటి ద్వారా మనుషులకూ వ్యాపించింది. కోతుల వంటి జంతువుల (బుష్ ఎనిమల్) లో ఈ వైరస్ ఉనికి బయటపడిందని, వాటి నుంచి మిగతా జంతువులకు వ్యాపించిందని చెప్పారు. తొలినాళ్లలో ఈ వైరస్ ఆఫ్రికా దేశాలకే పరిమితమైంది. అది కూడా మారుమూల గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో నివసించే వారికి ఈ వైరస్ సోకింది. వైరస్ బాధితులు ఇతర ప్రాంతాలకు వెళ్లినపుడు అక్కడ కొన్ని కేసులు నమోదయ్యాయి. చాలా వరకు జంతువులు, వాటి మాంసం కారణంగానే వైరస్ వ్యాపించింది తప్ప మనుషుల నుంచి మనుషులకు వైరస్ సోకిన దాఖలాలు లేవని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఎంపాక్స్ వైరస్ 2022 లో ఒక్కసారిగా విజృంభించింది. ఏకంగా 116 దేశాలలో వైరస్ కేసులు నమోదయ్యాయి. ఆగస్టులో వైరస్ వ్యాప్తి పీక్ కు చేరింది. వారానికి దాదాపుగా 6 వేల కేసులు రికార్డయ్యాయి. మొత్తంగా వివిధ దేశాలలో 99 వేలకు పైగా కేసులు నమోదయినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. దీంతో పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. జులై 23 నాటికి మంకీ పాక్స్ తో 200 మంది మరణించినట్లు పేర్కొంది. వైరస్ వేగంగా వ్యాపించడానికి కారణాలను గుర్తించేందుకు శాస్త్రవేత్తలు పరిశోధన చేయగా.. లైంగిక సంబంధాల వల్ల ఎంపాక్స్ వైరస్ వ్యాపిస్తోందని గుర్తించారు. వైరస్ బాధితులతో లైంగిక చర్యలో పాల్గొన్న వారికి ఎంపాక్స్ అంటుకుంటోందని తెలిపారు. ఆ తర్వాత వైరస్ లో మార్పులు, వ్యాక్సినేషన్ కారణంగా ఎంపాక్స్ కేసులు తగ్గుముఖం పట్టాయి.వైరస్ లో జన్యుపరివ్తనాల కారణంగా ఎంపాక్స్ ప్రస్తుతం మరింత ప్రమాదకరంగా మారిందని డబ్ల్యూ హెచ్ వో పేర్కొంది. కాంగో బేసిన్ స్ట్రెయిన్ గా వ్యవహరించే క్లాడ్ 1 ఎంపీఎక్స్ వి రకం వైరస్ తో మరణాల రేటు పెరిగే ప్రమాదం ఉందని తెలిపింది. కాంగో లోని సౌత్ కీవూ ప్రావిన్స్ కేంద్రంగా ప్రస్తుతం ఎంపాక్స్ విస్తరిస్తోందని, ఇది గ్లోబల్ పాండెమిక్ గా మారే అవకాశం ఎక్కువని చెప్పింది. ఈ వైరస్ కు మనుషుల నుంచి మనుషులకు వ్యాపించే గుణం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. దీంతో కేసులు పెద్ద సంఖ్యలో నమోదయ్యే అవకాశం ఉందని, మరణాలు కూడా పెరుగుతాయని హెచ్చరించారు. ఎంపాక్స్ వైరస్ కు అడ్డుకట్ట వేసేందుకు వ్యాధి నిర్ధారక పరీక్షలు పెంచడం, యాంటీ వైరల్ ట్రీట్మెంట్, వ్యాక్సిన్ తయారీ పెంచడం వంటి చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వైరస్ పై పరిశోధనలకు పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించాల్సిన అవసరం ఉందన్నారు.వైరస్ ఆఫ్రికా ఎల్లలు దాటి పాకిస్థాన్‌కు చేరింది. దేశంలో మూడు ఎంపాక్స్ కేసులను గుర్తించారు. ఈ వైరస్ గ్రస్త లక్షణాలతో ఉన్న ముగ్గురు రోగులను ఇప్పటివరకూ గుర్తించడం జరిగిందని అధికారులు శుక్రవారం తెలిపారు. ఒక్కరోజు క్రితమే ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్లుహెచ్ఒ మంకీపాక్స్‌పై గ్లోబల్ ఎమర్జెన్సీని ప్రకటించింది. పలు దేశాలూ అప్రమత్తం అయ్యాయి. పాకిస్థాన్‌లో ఈ కేసులు వెలుగులోకి రావడంతో ఈ వైరస్ తలెత్తిన తొలి ఆసియా దేశం పాకిస్థాన్ అయింది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఎయిర్‌పోర్టులలో వైద్య పరీక్షల స్క్రీనింగ్ విధానాలను మరింత పెంచాలని పాక్ ప్రభుత్వం శు క్రవారం నిర్ణయించింది. వేగవంత వ్యాప్తి లక్షణాల ఎంపాక్స్ వైరస్ వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫక్తూన్‌క్వా ప్రాంతంలో తలెత్తింది. ఈ విషయాన్ని ఈ ప్రాంత ఆరోగ్య విభాగం సంచాలకులు సలీం ఖాన్ తమ ప్రకటనలో నిర్ధారించారు. యుఎఇ నుంచి విమానంలో వచ్చిన వారిలో ఇద్దరికి ఈ వైరస్ సోకిన విషయం నిర్ధారించుకున్నట్లు ఖాన్ చెప్పారు. కాగా మరో వ్యక్తి రక్తపు శాంపుల్స్‌ను ఇస్లామాబాద్‌లోని జాతీయ ఆరోగ్య సంస్థకు పంపించారు. వైరస్ అనుమానాలను నిర్ధారించుకోనున్నారు. ఆరోగ్య విషయాల్లో దేశ ప్రధానికి సలహాదారులు, సమన్వయకర్త అయిన డాక్టర్ ముఖ్తార్ అహ్మద్ భారాత్ ప్రస్తుత స్థితిపై ప్రకటన వెలువరించారు. అన్ని ఆసుపత్రులలో రోగులకు క్షుణ్ణంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

## ఇస్రో మరో ఘనత.. నిప్పులు చిమ్ముతూ

# నింగిలోకి దూసుకెళ్లిన ఎస్ఎస్ఎల్వీ డీ3

నుంచి ఎస్ఎస్ఎల్వి డి3ని ఇస్రో విజయవంతంగా నింగిలోకి పంపింది. ఈ రాకెట్ ద్వారా భూ పరిశీలన ఉపగ్రహం (ఇఒఎస్–08)ని ఇస్రో నిర్ణీత కక్షలోకి ప్రవేశపెట్టింది. విపత్తుల సమయంలో ఈ ఉపగ్రహం కీలక సమాచారం పంపిస్తుంది. ప్రకృతి విపత్తులతో పాటు అగ్ని పర్వతాలను కూడా ఈ శాటిలైట్ పర్యవేక్షిస్తుంది. మొత్తం 17 నిమిషాల పాటు రాకెట్ ప్రయోగం సాగింది. ఈ ప్రయోగం అనంతరం ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్‌లో సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, 'ఇఒఎస్–08తో ఈ మూడవ అభివృద్ధి ఫ్లైట్ ఎల్వి డి3 లక్ష్యాన్ని సాధించింది. ముందు నిర్ణయించిన ప్రకారమే నిర్దేశిత కక్షలో ఎస్ఎస్ఎల్విని రాకెట్ ప్రవేశపెట్టింది.ఈ క్రమంలో ఎటువంటి మళ్లింపులూ లేవు' అని చెప్పారు. ఉపగ్రహం ప్రయోగ కొలమానాలు ప్రతిదీ పక్కాగా ఉందని సూచిస్తున్నాయని, భూ పరిశీలన ఉపగ్రహం, ప్యాసింజర్ ఉపగ్రహం ఎస్ఆర్–ఒ డెమోశాట్ నిర్దేశిత విన్యాసాల అనంతరం కక్షలోకి ప్రవేశపెట్టడమైందని ఆయన తెలియజేశారు. 'ఎల్వి డి3 ప్రాజెక్ట్ బృందానికి అభినందనలు. దీనితో ఈ మూడవ అభివృద్ధి ఫ్లైట్ ఎల్వి పూర్తి అయింది' అని సోమనాథ్ చెప్పారు.

'పరిశ్రమలకు ఎల్వి టెక్నాలజీల బదలీ ప్రక్రియలో ఉన్నా. అందువల్ల ఇది ఎల్వికి, ప్రయోగ నౌకకు శుభారంభం' అని ఆయన పేర్కొన్నారు. 'ఇది 100 శాతం జయప్రదం. ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్షలోకి ప్రవేశపెట్టడమైంది' అని సోమనాథ్ ఆ తరువాత విలేకరులతో చెప్పారు. ఇఒఎస్‌ను యుఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో అభివృద్ధి చేశారు. ఈ ఉపగ్రహంలో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ పేలోడ్ మిడ్ వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రారెడ్‌లో చిత్రాలు తీస్తుంది. ఈ శాటిలైట్ పంపించే సమాచారం విపత్తు నిర్వహణలో ఎంతో ఉపయోగపడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ఉపగ్రహం ఏడాది పాటు పని చేస్తుంది.

## ఎంఎల్‌సిలుగా కోదండరామ్,

# ఆమెర్ ప్రమాణ స్వీకారం

ఎమ్మెల్సీల నియామకంపై గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై తాజాగా సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు హైకోర్టు ఆదేశాలపై స్టే ఉంటుందని జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరలే ధర్మాసనం స్పష్టం చేసింది. కొత్తగా ఎమ్మెల్సీలను నియమించకుండా అడ్డుకునేలా స్టే విధించాలని పిటిషనర్లు కోరగా అందుకు ధర్మాసనం నిరాకరించింది. కొత్త ఎమ్మెల్సీల నియామకాన్ని అడ్డుకుంటే గవర్నర్, ప్రభుత్వ హక్కులకు భంగం కలిగించనట్లే అవుతోందని, ఖాళీలను భర్తీ చేయడం ప్రభుత్వం కర్తవ్యమని ధర్మాసనం వెల్లడించడంతో కొదండరాం, అలీఖాన్ లైన్‌లకు శాసనమండలి సభ్యులకు ప్రమాణం చేసేందుకు మార్గం సుమగమైంది.

## బంగ్లాదేశ్‌లో హిందువులకు

# భద్రత కల్పిస్తాం : ప్రధాని మోడీ

మనుషులంతా ఒక్కటేనని అన్నారు. సంస్థాగత లోపాల వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు, ఇతర మైనారిటీ వర్గాలకు రక్షణ, భద్రత కల్పిస్తామని ప్రధాని నరేంద్ర మోడీకి బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ ముఖ్య సలహాదారు ముహమ్మద్ యూనస్ శుక్రవారం ఫోన్‌లో హామీ ఇచ్చారు. షేఖ్ హసీనా ప్రభుత్వ పతనానంతరం యూనస్ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయనకు, మోడీకి మధ్య జరిగిన తొలి ఫోన్ సంభాషణ ఇదే. ప్రజాస్వామిక, సుస్థిర, శాంతియుత, ప్రగతిశీలక బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఉంటుందని తాను పునరుద్ఘాటించినట్లు ప్రధాని మోడీ 'ఎక్స్' పోస్ట్‌లో తెలియజేశారు. 'జిఒబి ముఖ్య సలహాదారు ప్రొఫెసర్ ముహమ్మద్ యూనస్ నుంచి ఒక టెలిఫోన్ కాల్ అందుకున్నాను. ప్రస్తుత పరిస్థితిపై అభిప్రాయాలు పంచుకున్నాం. ప్రజాస్వామిక, సుస్థిర, శాంతియుత, ప్రగతిశీలక బంగ్లాదేశ్‌కు భారత మద్దతును పునరుద్ఘాటించాను. బంగ్లాదేశ్‌లో హిందువులు, అన్ని ఇతర మైనారిటీలకు రక్షణ, భద్రతకు ఆయన హామీ ఇచ్చారు' అని మోడీ తన పోస్ట్‌లో తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీల భద్రత గురించి ప్రధాని మోడీ గురువారం తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఆందోళన వెలిబుచ్చారు. 'ఒక పొరుగు దేశంగా బంగ్లాదేశ్‌లో పరిణామాల పట్ల ఆందోళనను అర్థం చేసుకోగలను. అక్కడ పరిస్థితి త్వరలో సర్దుకుంటుందని ఆశిస్తున్నా' అని మోడీ తెలిపారు.

## శంకర్‌పల్లిలో మాజీ మంత్రి

# కేటీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం




**శంకర్‌పల్లి: ఆగస్టు 16: (డైలీ రిపోర్ట్):** చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్ ఆదేశాల మేరకు శుక్రవారం శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తా దగ్గర కాంగ్రెస్ పార్టీ మండల, మున్సిపల్ నాయకులు మహిళల ఉచిత బస్సు ప్రయాణం పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో ఆరు గ్యారంటీ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కాంగ్రెస్ పార్టీపై మహిళల్లో పెరుగుతున్న ఆదరణ ను చూసి ఓర్వలేక మాజీ మంత్రి కేటీఆర్ మతి భ్రమించి మహిళల పట్ల ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడన్నారు. పదేళ్లలో తెలంగాణను పబ్బులు, క్లబ్ లను పెట్టి గబ్బు పట్టించిన కేటీఆర్ వెంటనే తెలంగాణ మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి మహిళల గురించి ఇష్టమొచ్చినట్లు అనవసరంగా నోరు పారేసుకుంటే మహిళలే తిరగబడి సరైన రీతిలో బుద్ధి చెపుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లిలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

**శంకర్‌పల్లి: ఆగస్టు 16:(డైలీ రిపోర్ట్):** వరాలిచ్చే మహాలక్ష్మి మమ్మల్ని చల్లగా చూసి.. వరాలు ఇమ్మని వేడుకుంటూ మహిళలు పూజలు చేశారు. అమ్మ అనుగ్రహంతో ప్రతి ఇంటా సిరిసంపదలు చేకూరుతాయని నిర్వహించే వరలక్ష్మి వ్రతం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో శుక్రవారం వైభవంగా సాగాయి. మున్సిపల్ రెండవ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్ కుమార్ ఎన్.ఆర్ వెంచర్ గణేష్ నగర్ లోని అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. పలు కాలనీల ఇళ్లలో మొదలుకొని అన్ని వార్డుల ఆలయాల్లో భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. అమ్మవారికి స్వాగత సూచికగా ఇళ్లముందు మహిళమనులు ముగ్గులుపెట్టి మామిడితోరణాలతో వరలక్ష్మికి ఘనస్వాగతం పలికారు.

**మహిళలు మహాలక్ష్మిదేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించి**

వరలక్ష్మి వ్రతమహత్యాన్ని తెలుసుకున్నారు. ముత్తైదువులకు వాయనాలు ఇచ్చి పది కాలాల పాటు సుమంగళిగా ఉండే విధంగా ఆశీస్సులు అందుకున్నారు. వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని మహిళ మణులు ఉదయం నుంచే పూజాది కార్యక్రమాలకు ఉపక్రమించారు. కలశానికి అమ్మవారి రూపంలో అందంగా అలంకరించి వరలక్ష్మీ వ్రత కథను చదివి పూజ నిర్వహించారు.. కాగా స్థానిక ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి పసుపు, కుంకుమలను మహిళలు వాయినంగా ఇచ్చుకున్నారు.





## ఎడిటోరియల్

# ఆచరణ తక్కువ- ఆర్భాటం ఎక్కువ

దివంగత ప్రధానులు నెహ్రూ, ఇందిరా గాంధీ తరువాత వరుసగా 11వ సారి జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించిన రికార్డు ప్రధాని మోడీదే. రికార్డులు బాగున్నాయి. ప్రసంగాలు అంతకన్నా ప్రతీసారి అదరగొడుతున్నారు. కాని ప్రసంగాల విషయంలో ఆచరణలోకి వస్తే ఆర్భాటం తప్ప అమలు 50 శాతం కూడా ఉండడం లేదు. అలాగే, గురువారం 98 నిమిషాల పాటు ఏకధాటిగా ప్రసంగించిన ఘనత కూడా ఆయనదే. ఇక ఈ ప్రసంగాల తీరును పరిశీలిస్తే జరుగుతున్న పరిణామాలు వాస్తవాలకు దూరం గా ఉంటున్నాయి. ముఖ్యంగా యువతకు నూతన అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతి సాధించామని చెప్పుకొచ్చారు.

కానీ ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే యువతలో నిరుద్యోగం రేటు 17 శాతానికి చేరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తదితర 11 రాష్ట్రాల్లో నిరుద్యోగం రేటు 20 శాతానికి పైగా ఉందని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే చెబుతోంది. ఇక ఉపాధి కల్పన సంగతి పరిశీలిస్తే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి (ఎంజిఎన్ఇజిఎస్) పథకాన్నే ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. మొత్తం నమోదైన ఉపాధి హామీ కార్మికులు 25.25 కోట్ల మంది కాగా, ఆధార్ కార్డు లేనివారు 7.6 కోట్ల మంది ఈ పథకం నుంచి తప్పుకోవలసి వచ్చింది. వంద రోజులు పని కల్పించడానికి బదులు కేవలం 16 రోజులకు మాత్రమే పని కల్పిస్తున్నారు. దీని బట్టి ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతి ఎలా సాధించినట్టు? ఇక ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత్ ఎదగాలి అని మోడీ ప్రసంగంలో ఉద్ఘాటించారు.

ఇది వినడానికి బాగానే ఉన్నా క్షేత్రస్థాయి వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. ఆకలి, పోషకాహార లోపాలతో దేశ వ్యాప్తంగా రోజుకు సుమారు 4500 మంది పిల్లలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. 145 కోట్ల మంది జనాభాలో 81 కోట్ల మందికి ప్రభుత్వమే ఉచితంగా ఆహార ధాన్యాలు పంపిణీ చేయాల్సి వస్తుంటే ప్రపంచానికి అన్నం పెట్టే స్థాయికి ఎప్పుడు భారత్ ఎదుగుతుందో ప్రశ్నార్థకం. మధ్యతరగతి వర్గాల పిల్లలపై లక్షలు పెడుతున్నామని, మన విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఉండకూడదని మోడీ తన ప్రసంగంలో అభిప్రాయపడ్డారు. కానీ దేశంలో విద్యారంగం చాలా దీనస్థితిలో ఉంది. యూనివర్శిటీల్లో ప్రొఫెసర్ల ఉద్యోగాలే కొన్ని నెలలుగా భర్తీ కావడం లేదు. దేశ వ్యాప్తంగా 11 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అందులోని 69 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పడ్డాయని యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్, అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) నివేదిక చెబుతోంది. దేశంలో 1829 సంవత్సరాలు వారు 22% అంటే 26 కోట్ల పది లక్షల మంది, 1024 సంవత్సరాల వయసు వారు 35 కోట్ల 60 లక్షల మంది ఉన్నారు. ఇంతమంది యువతకు ఆధునిక చదువులు, నైపుణ్యాలు కలిగించకపోవడం పెద్ద లోపం. అలాంటప్పుడు విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఎలా తప్పించగలం? ఇక వ్యవసాయానికి సంబంధించి భారత్‌లో చిరుధాన్యాలు అందరికీ చేరాలని ప్రధాని పిలుపు ఇవ్వడం బాగానే ఉంది. కానీ వ్యవసాయ రంగానికి ప్రభుత్వపరంగా ఏ విధంగా సహాయ సహకారాలు లభిస్తున్నాయో ప్రత్యక్షంగా చూస్తున్నాం. ముఖ్యమైన పంటలకు కనీస మద్దతు ధర చట్టప్రకారం కల్పించాలని రైతులు సాగిస్తున్న పోరాటం ఏమాత్రం ఫలించడం లేదు. బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై దాడులు సాగుతుండడంపై ప్రధాని మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. కానీ మనదేశంలోనే మణిపూర్‌లో ఒక వర్గంపై నిత్యం జరుగుతున్న హింసాకాండను విస్మరించారు. కనీసం ఒకసారైనా మణిపూర్‌ను ప్రధాని సందర్శించకపోవడం గమనార్హం. గత ఏడాది 77వ స్వాతంత్ర్య దినోత్సవం నాడు కూడా ప్రధాని మోడీ ఎర్రకోటపై నుంచి అన్నీ గొప్పలే చెప్పుకున్నారు. 140 కోట్ల దేశ జనాభా తన కుటుంబమన్నారు. జనాభాలో ముప్పై ఏళ్ల లోపు యువత అత్యధికంగా ఉన్నారని, వారి శక్తి సామర్థ్యాలు అమోఘమన్నారు.

కానీ పెరుగుతున్న నిరుద్యోగం పరిష్కారం సంగతి దాటవేశారు.దళితులు, పీడితులు, ఆదివాసీలు గౌరవంగా బతకాలని కోరుకున్నా ఆదివాసీలకు కనీస వసతులు ఇప్పటికీ వారి గూడేలలో సమకూరలేదన్నది వాస్తవం. ఇక సెబి అదానీ వ్యవహారం ఎంత సంచలనం కలిగించిందో తెలిసిందే. ఈ విషయంలో ప్రభుత్వం కిమ్మనడం లేదు. దర్యాప్తులో ఏ అంశాలు తేలాయో బయటపడలేదు. గత పదేళ్లలో మోడీ ప్రభుత్వం చేసిందంతా కార్పొరేట్ సంస్థలకు పబ్లిక్ రంగ పరిశ్రమలను ధారాదత్తం చేయడమే. అదానీ, అంబానీ వంటి ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థను మరింత ప్రోత్సహించడమే. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాలు ఎంత గొప్పగా ఉన్నా అవి ఎంతవరకు దేశాన్ని పారదర్శకంగా ప్రగతి మార్గంలో నడిపిస్తున్నాయో ప్రభుత్వమే ఆత్మవిమర్శ చేసుకోవలసిన అవసరం ఉంది.

# భూఆక్రమణలో బహుళజాతి సంస్థలు!



2007-08 లో వచ్చిన ఆహార సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకుని యూరోపియన్ యూనియన్ దేశాలు, కొన్ని అరబ్ దేశాలు, ఆసియా దేశాలు, బహుళ జాతి సంస్థలు భవిష్యత్తులో రాబోయే ఆహార సంక్షోభం దృష్టిలో పెట్టుకుని, వ్యాపార ప్రయోజనాల కోసం పెద్ద ఎత్తున భూసమీకరణకు పాల్పడుతున్నాయి. లక్షలాది ఎకరాలు లీజు, కొనుగోల్ల పేరుతో స్థానిక దేశాల ప్రభుత్వాల నుంచి పొందుతున్నాయి. ముఖ్యంగా ఆఫ్రికా దేశాల భూములు వీటి పరమవుతున్నాయి. ఈ దేశాల మొత్తం భూమిలో 2 నుంచి 10 శాతం మధ్య మాత్రమే అధికారికంగా రైతులు భూమి కలిగి ఉన్నారని 2003 ప్రపంచ బ్యాంకు అధ్యయనం అంచనా వేసింది.

భూమిపై అత్యధికంగా ప్రభుత్వ యాజమాన్యం, సంక్లిష్టమైన రిజిస్ట్రేషన్ విధానం, ఆ దేశాల ఆచార వ్యవస్థలు సరిపోతాయని ఆ దేశాల ప్రజలు భావించటం అందుకు కారణం. సామ్రాజ్యవాదులు, బహుళ జాతి సంస్థలకు లొంగిన ఆఫ్రికన్ దేశాల పాలకులు, తమ ఆధీనంలో భూములను సంపన్న దేశాలకు, బహుళజాతి సంస్థలకు అతి చవకగా అమ్మటం లేదా లీజుకి ఇచ్చి వాటి పరం చేస్తున్నాయి. ఇంటర్నేషనల్ పాలసీ రీసెర్చ్ (ఐఎఫ్‌పిఆర్) 2009 అంచనా వేసిన ప్రకారం 2006 నుంచి వెనకబడిన దేశాల్లో 15 నుంచి 20 మిలియన్ల హెక్టార్ల భూములు అన్యాక్రాంత మైనాయి. జనవరి 2013 నాటికి ల్యాండ్ పోర్టల్ మ్యాట్రిక్ డేటా ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 49 మిలియన్ హెక్టార్ల భూ ఒప్పందాలు జరిగాయి. 2011 ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం 56 మిలియన్ హెక్టార్ల భూములు చేతులు మారాయి. 2012లో ఆఫ్రికాలోనే 63 మిలియన్ల హెక్టార్ల భూమి పరాయీకరణ చెందింది. అదే సంవత్సరం %+తీఘఅఅ% (గ్రెయిన్) ప్రచురించిన డేటా ప్రకారం 35 మిలియన్ హెక్టార్ల భూమి ఆఫ్రికా దేశాల నుంచి కొనుగోళ్లు జరిగాయి. 1990- 2011 మధ్య వెస్ట్ బ్యాంక్ (పాలస్తీనా) లో 195 కిలోమీటర్ల భూమిని ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకున్నది.

ఈ విధంగా ప్రపంచంలో పరాయీకరణ చెందిన భూమి 4 కోట్ల హెక్టార్ల కంటే ఎక్కువగా ఉంది. సూడాన్‌లో అమెరికా సంస్థలు, ఆర్క్ క్యావ్, నైల్ ట్రేడింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఇంక్ మధ్య 10 లక్షల హెక్టార్ల భూమి తీసుకున్నాయి.చైనా- కొలంబియా మధ్య నాలుగు హెక్టార్ల భూబదలాయింపు ఒప్పందం జరిగింది. టాంజానియాలో 3 లక్షల 25 వేల హెక్టార్ల భూమి లీజుకి బహుళజాతి సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. పాకిస్తాన్‌లో యుఎఇ 3 లక్షల 24 హెక్టార్ల భూమిని కొనుగోళ్లు చేసింది.

# కార్పొరేట్లకు మోకరిల్లుతున్న మోడీ







కేంద్రంలో మూడోసారి ఎన్‌డిఎ పక్షాల సహకారంతో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం 48 లక్షల 20 వేల 512 కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్ తీరుతెన్నులను పరిశీలిస్తే దేశంలో ఉన్న పిడికెడు మంది శతకోటీశ్వరులను సంపదను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం వంద కోట్ల మంది ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలి వేసినట్లుందని చెప్పవచ్చు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను గమనిస్తే 100 కోట్ల మంది ప్రజలకు కేటాయించాల్సిన నిధులను అంబానీ, అదానీ, తదితర శత కోటీశ్వరులకు కట్టబెట్టేందుకు రూపొందించబడినట్లుగా అర్థమవుతున్నది. అందుకే ఇది ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, మహిళా వ్యతిరేక, పారిశ్రామిక వ్యతిరేక బడ్జెట్‌గా చెప్పవచ్చు.

మొత్తంగా సంక్షేమాన్ని వదులుకొనే మోడీ ప్రభుత్వ విధానాన్ని తెలియజేస్తున్నది. బడ్జెట్ స్వరూపాన్ని ఒక్కమాటలో చెప్పాలంటే ఇది అన్ని వర్గాల సంక్షేమానికి గొడ్డలిపెట్టుగా ఉందని, సంపన్నుల బొజ్జలు నింపేందుకు పేదల కడుపు కొట్టేదిగా ఉందని స్పష్టంగా చెప్ప వచ్చు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రవేశపెడుతున్న బడ్జెట్లలో ప్రజా సంక్షేమానికి క్రమంగా నిధులను తగ్గిస్తూ వస్తున్నది. దేశంలో 87 కోట్ల మంది పేదలకు ఉచిత బియ్యాన్ని ఇస్తున్నట్లు భవిష్యత్తులో కూడా దీనిని కొనసాగిస్తామని ఎన్నికల ప్రచారం లో ప్రధాని చెప్పారు. దేశంలో రేషన్ కార్డులు లేనివారు ఎందరో ఈ లెక్కలో రాకుండా ఉన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆహార సబ్సిడీకి 2022-23 బడ్జెట్‌లో రూ. 2,72,802 కోట్లు కేటాయించగా, 2023- 24లో రూ. 2,12,332 కోట్లు కేటాయించారు. ప్రస్తుత 2024 -25 బడ్జెట్‌లో రూ. 2,05,250 కోట్లు మాత్రమే కేటాయించారు.

అంటే ఒక్క ఆహార సబ్సిడీలోనే గత మూడేళ్ల కాలంలో క్రమంగా రూ. 67,552 కోట్లు ఆహార సబ్సిడీలు తగ్గించారు. మొత్తంగా ఆహార సబ్సిడీకి 2022-23లలో కేంద్ర బడ్జెట్లో 6.51% నిధులను కేటాయిం చగా, 2024 -25లో 4.26% మాత్రమే కేటాయించడం జరిగింది. అదే విధంగా రైతుల ఎరువులకు ఇస్తున్న సబ్సిడీకి సంబంధించి 2022 -23లో రూ. 2,51,339 కోట్లు కేటాయించగా, 2023 -24 లో రూ. 1,88,894 కోట్లు, 2024-25 బడ్జెట్లలో రూ. 1,64,000 కోట్లు కేటాయించారు. మూడు బడ్జెట్ల కాలంలో మొత్తంగా రూ. 87,339 కోట్ల సబ్సిడీని తగ్గించారు. రైతులకు ఇస్తున్న యూరియాకు 2022 -23లో రూ. 1,65217 కోట్లు కేటాయించగా, 2023 -24లో 1,51,100 కోట్లు, 2024 -25 బడ్జెట్లో రూ. 1,00,340 కోట్లు కేటాయించారు. అంటే రూ. 65,217 కోట్లు మూడు బడ్జెట్ల కాలంలో యూరియాకి ఇస్తున్న సబ్సిడీని తగ్గించి రైతులపై భారాన్ని పెంచారు.

అంతేకాకుండా బడా కార్పొరేట్లకు రూ. 16 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను రద్దు చేసిన మోడీ ప్రభుత్వం వ్యవ సాయ రంగంలో సాగుకు అప్పులు చేసిన రైతాంగానికి రూ. 5 లక్షల కోట్ల పంట రుణాలు మాఫీ చేయడానికి సిద్ధంగా లేదు. మొత్తంగా వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఇచ్చిన ప్రాధాన్యతను గమనిస్తే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 2019-20లో 5.44%, 2020-21లో 5.08%, 2021- 22లో 4.06%, 2022- 23లో 3.84%, 2023-24లలో 3.20%, 2024-25 లలో 3.15% నిధులను కేటాయించారు. 145 కోట్ల మందికి కడుపు నింపే అన్నదా తలకు ఇస్తున్న ప్రాధాన్యత అర్థం చేసుకోవచ్చు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఏటా వ్యవసాయ రంగానికి కేటాయిస్తున్న బడ్జెట్ ఎలా తగ్గిస్తూ వచ్చారో స్పష్టంగా అర్థం అవుతుంది. జైజవాన్, జైకిసాన్ అంటున్నా దేశంలో అన్నదాతలకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు ఇస్తున్న ప్రాధాన్యత ఎంతో అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయ రంగానికి రైతులకు బడ్జెట్లో ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా కార్పొరేట్ల సంపాదన పెంచేందుకు వారికి రూ. 16 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను రద్దుచేసి వారికి అనేక రాయితీలు కల్పించి కేంద్ర ప్రభుత్వం ఆదుకుంటూ వస్తున్నది. అందువల్ల ఇది రైతుల ప్రయోజనాలను పట్టించుకోకుండా ఉన్న రైతు వ్యతిరేక ప్రభుత్వమని అర్థం చేసుకొనవచ్చు.

మోడీ ప్రభుత్వం 2018లో తెచ్చిన ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకంలో 10 కోట్ల మంది సభ్యులున్నారు. రైతులకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నదనే దానితో సంబంధం లేకుండా, కుటుంబంలో ఎంత మందికి పట్టా పాసు పుస్తకాలు ఉన్నాయనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఒక్కరిని మాత్రమే లెక్కగట్టి ఏటా రూ. 6000లు మూడు విడతలుగా ఎకౌంట్లో జమ చేస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలోనే 47 లక్షల మంది రైతులు ఉన్నట్లుగా తెలుస్తున్నది. ఈ లెక్కన దేశవ్యాప్తంగా రైతులను పూర్తిగా లెక్కించి వారికి ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం అమలు చేయడానికి అవసరమైన నిధులను కేటాయించడానికి మోడీ ప్రభుత్వం పూనుకొనడం లేదు. 2018 నాటి లెక్కల మీద ఆధారపడి నిధులను పెంచకుండా అన్యాయం చేస్తున్నది. అంబానీ, అదానీల ఆస్తులకు సంబంధించి అక్రమ మార్గాల ద్వారా మోడీ ప్రభుత్వం అండదండలతో సంపాదించిన విషయాన్ని హిండెన్‌బర్గ్ నివేదిక వివరంగా బయటపెట్టింది. దేశప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపిస్తే ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పిడికెడు మంది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను ఎత్తుకొని ప్రధాని, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు పూనుకోవడం దేశ ప్రజలకు నష్టం. భారత దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైనది.

# బాలీవుడ్‌లో శ్రీలీల... తేడా కొట్టదుగా?



సౌత్‌లో కమర్షియల్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న అందాల భామ శ్రీలీల. పెళ్ళిసంద మూవీతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. ఈ బ్యూటీ మొదటి చిత్రంతో ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. తరువాత రవితేజకి జోడీగా చేసిన ధమాకా కమర్షియల్ హిట్ అయ్యింది. నెక్స్ట్ వచ్చిన ఆదికేశవ డిజాస్టర్ గా నిలిచింది, భగవంత్ కేసరి మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అయిన కూడా శ్రీలీల ఆ చిత్రంలో హీరోయిన్ కాదు. ఈ ఏడాది సంక్రాంతికి గుంటూరు కారం సినిమాతో ఈ బ్యూటీ ప్రేక్షకుల ముందుకొచ్చి సందడి చేసింది. ఈ సినిమాలో సాంగ్స్ బాగున్నా కూడా శ్రీలీల క్యారెక్టర్ కి పెద్దగా ప్రాధాన్యత లేదు. మూవీ కూడా కమర్షియల్ గా ఫెయిల్ అయ్యింది. దీంతో తెలుగులోనే శ్రీలీల కెరియర్ సోసోగా సాగుతోంది. శ్రీలీల హోప్స్ అన్ని కూడా డిసెంబర్ లో రాబోయే రాబిన్ హుడ్ సినిమా మీదనే ఉన్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్ తో పాటు రవితేజతో మరో సినిమాని శ్రీలీల చేస్తోంది. ఈ రెండు వచ్చే ఏడాది రానున్నాయి. శ్రీలీల స్టోరీ సెలక్షన్ కరెక్ట్ గా లేదనే మాట సినీ విశ్లేషకుల నుంచి ప్రస్తుతం వినిపిస్తోంది. ప్రస్తుతం హీరోయిన్స్ లలో చాలా మంది తమ పాత్రలకి ప్రాధాన్యత ఉంది అనుకుంటేనే మూవీస్ ఒప్పుకుంటున్నారు. స్టార్ హీరోయిన్ గా పాన్ ఇండియా లెవల్ లో దూసుకుపోతున్న రష్మిక చాలా సెలక్టివ్ గా మూవీస్ చేస్తోంది. భగవంత్ కేసరి సినిమా చూస్తే శ్రీలీల మంచి మంచి టాలెంటెడ్ యాక్టర్ అనిపిస్తుంది. కానీ ఇప్పటి వరకు హీరోయిన్ గా ఆమె ప్రాధాన్యత లేని పాత్రలే చేసిందని ఫిల్మ్ క్రిటిక్స్ అంటున్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు శ్రీలీల బాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా తెరకెక్కనున్న మిట్టీ మూవీలో శ్రీలీల హీరోయిన్ గా ఎంపికైందంట. అక్టోబర్ నుంచి ఆమె షూటింగ్ లో జాయిన్ అవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉత్తరాఖండ్ లో ఈ మూవీ రెగ్యులర్ షూట్ జరుగుతోంది. గత కొంతకాలంగా సిద్ధార్థ్ కి బాలీవుడ్ లో సక్సెస్ లు లేవు. అతని సినిమాలకి పెద్దగా బిజినెస్ కూడా జరగడం లేదనే టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ డెబ్యూ సినిమానే అలాంటి స్టార్ కి జోడీగా శ్రీలీల గ్రీన్ సిగ్నల్ ఇచ్చి పెద్ద రిస్క్ చేస్తుందనే మాట వినిపిస్తోంది. సినిమా ఏ మాత్రం తేడా కొట్టిన మరల బాలీవుడ్ దర్శకులు శ్రీలీలపై దృష్టి పెట్టే ఛాన్స్ ఉందదని సినీ విశ్లేషకులు అంటున్నారు. అయితే ఈ చిత్రంలో మంచి బలమైన పాత్రలో శ్రీలీల నటిస్తుందంట. మిట్టీ మూవీ ఆమెకి బాలీవుడ్ లో ఎంత వరకు క్రేజ్ తీసుకొస్తుందనేది అప్పుడే చెప్పలేం. ఇదిలా ఉంటే గతంలో వరుణ్ ధావన్ కి జోడీ ఆమె ఒక సినిమాలో కన్ఫర్మ్ అయ్యిందనే ప్రచారం జరిగింది. దాంట్లో వాస్తవం లేదని ఆ చిత్రం నిర్మాత తేల్చేశారు. దీంతో హిందీలో శ్రీలీల డెబ్యూ మూవీగానే మిట్టీ తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది.

# ఆయ్ మూవీ.. ఎలా ఉందంటే..




ఆగస్ట్ 15న లాంగ్ వీకెండ్ ను క్యాష్ చేసుకోవాలని ఒకేసారి మూకుమ్మడిగా సినిమాలు పోటీలో దిగాయి. వేటికవే భిన్నంగా ఉన్న సినిమాలు గ్రాండ్ ప్రమోషన్ తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం అయితే చేశాయి. ఇక ఈ పోటీలో ఆయ్ అనే సినిమా కూడా వచ్చింది. కంటెంట్ మీద నమ్మకంతో బన్నీ వాసు మంచి ప్రమోషన్స్ చేసి ప్రీమియర్స్ తోనే ఆడియెన్స్ ను ఎట్రాక్ట్ చేసే విధంగా అడుగులు వేశారు. టీజర్, ట్రైలర్, పాటలను బట్టి ఇది మంచి ఎంటర్టైన్మెంట్ మూవీ అని ఒక క్లారిటీ అయితే ఇచ్చారు. నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటించిన ఈ సినిమాను గీతా ఆర్ట్స్ 2 బ్యానర్ లో రూపొందించారు. నితిన్‌తో పాటుగా అంకిత్ కొయ్య, కసిరాజు ప్రముఖ పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పించగా.. బన్నీ వాస్, విద్యా నిర్మించారు. ఇక ఆగస్ట్ 15న ఈ చిత్రం విడుదలైంది. ఆయ్ సినిమాకు ట్రైలర్, టీజర్, సాంగ్స్ బాగానే హైప్ పెంచాయి. సినిమా విడుదల అనంతరం టాక్ ఎలా ఉంది అనే వివరాల్లోకి వెళితే.. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ కథలో దర్శకుడు అంజి కులం కంటే స్నేహం గొప్పదని ఎంతో సింపుల్‌గా, హార్ట్ టచింగ్‌గా కథను అల్లిన విధానం ఆకట్టుకుంది. నిర్మాణ విలువలు గీతా ఆర్ట్స్‌కు తగ్గట్టుగా ఉన్నాయని నెటిజన్స్ ప్రశంసిస్తున్నారు. ఆర్టిస్టుల విషయానికి వస్తే.. ముందుగా నార్నే నితిన్ ఈ సినిమా వాతావరణంకు తగ్గట్టుగా మంచి పెర్ఫామెన్స్ ఇచ్చాడు. ఇలాంటి పాత్రలకు నితిన్ పర్ఫెక్ట్ గా న్యాయం చేయగలడు అనేలా పాజిటివ్ కామెంట్స్ అందుకుంటున్నాడు. ముఖ్యంగా ఎమోషనల్ సీన్స్, యాక్షన్, కామెడీ ఇలా అన్ని యాంగిల్స్‌లో అతను మెప్పించిన తీరు బాగుంది. మరో నటుడు అంకిత్ కొయ్య కూడా తన పాత్రతో బాగానే నవ్వించాడు. అలాగే హీరోయిన్ నయన్ సారిక కుర్రాళ్లను తన క్యూట్ హావభావాలతో కట్టి పడేస్తుంది. చలాకీ తనంతో తెరపై ఇట్టే ఎట్రాక్ట్ చేసిందని అంటున్నారు. ఇక కథ పరంగా మిగిలిన పాత్రలన్నీ కూడా పర్వాలేదనిపిస్తాయి. ఆయ్ సినిమా చూస్తే మనసుకు హాయి మాత్రం కలుగుతుందని ఓ వర్గం ఆడియెన్స్ నుంచి బలమైన టాక్ వినిపిస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే పెట్టిన డబ్బులకి తెగ నవ్వేస్తారని అంటున్నారు. ఇక ఈ వీకెండ్ లో సందడి చేస్తున్న సినిమాల్లో ఇదే బెస్ట్ ఛాయిస్ అని కూడా చెప్పవచ్చు. సినిమా మొదటి నుంచి క్లయిమాక్స్ ముందు వరకు ఒక మంచి కామెడీ ఎంటర్టైనర్ గా కొనసాగిన ఆయ్ చివరలో హార్ట్ ను టచ్ చేసేలా ఓ మంచి ఎమోషన్‌తో నింపేస్తుంది. ఫైనల్ గా గీత ఆర్ట్స్ 2 లో మరో మంచి సినిమా వచ్చింది అనేలా కామెంట్స్ వస్తున్నాయి. మరిన్ని వివరాలు రాబోయే పూర్తి రివ్యూలో చూద్దాం..

# జగ్గూ భాయ్.. ఈ స్టైల్ కేక

పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడాయన బిజీగా ఉంటూ వరుస సినిమాల్లో నటిస్తున్నారు. రేపు రిలీజ్ కాబోతున్న "మిస్టర్ బచ్చన్" సినిమాలో కూడా జగపతిబాబు మరో సరికొత్త పాత్రలో దర్శనమివ్వబోతున్నారు. సినిమాల సంగతి పక్కన పెడితే, ఆయనకు సోషల్ మీడియాలో కూడా మంచి ఫాలోయింగ్ ఉంది. జగపతి బాబు సోషల్ మీడియాలో చురుకుగా ఉంటారు. ఆయన ప్రతి ఫోటోతో పాటు తెలుగులో చమత్కారమైన క్యాప్షన్ రాసి అభిమానులను ఆకట్టుకుంటుంటారు. ఇటీవలే ఆయన బ్లాక్ డ్రస్, సిల్వర్ చైన్స్, స్టైలిష్ బ్యాగ్, బ్లాక్ గాగుల్స్ వేసుకుని స్టైలిష్ లుక్ లో ఒక ఫోటోను షేర్ చేశారు. దీనికి ఆయన "వయస్సు పెరిగేకొద్దీ తగ్గించుకుందామనే ప్రయత్నంలో ఉన్నా.. మీకు ఓకేనా..?" అని క్యాప్షన్ రాసి, అభిమానులను అలరించారు. ఈ క్యాప్షన్ కి అభిమానులు తమదైన శైలిలో స్పందిస్తూ, "మీరు ఇప్పటికీ హీరోలాగానే ఉన్నారు", "మరింత అందం పెంచండి" వంటి కామెంట్స్ చేస్తూ సపోర్ట్ చేస్తున్నారు. ఈ ట్రెండ్ చూస్తుంటే, ముందుముందు జగపతి బాబు ఇంకా స్టైలిష్ లుక్స్ లో కనిపించబోతున్నారని చెప్పడం ఆశ్చర్యం కాదు. ఇక ఆయన వయసు 60 లో ఉన్నా కూడా ఇంకా 30 ఏళ్ళ యువకుడి తరహాలో ఉన్నట్లు మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం జగపతిబాబు నాలుగు సినిమాలు చేస్తున్నారు. అందులో పుష్ప 2 కూడా ఉంది. మరో రెండు ప్రాజెక్టులు కూడా చర్చల దశలో ఉన్నట్లు తెలుస్తోంది.



# మిస్టర్ బచ్చన్‌లో అక్కినేని రిఫరెన్స్



రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన మిస్టర్ బచ్చన్ నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాలో రవితేజకు జోడీగా భాగ్య శ్రీ నటించింది. బాలీవుడ్ హిట్ మూవీ రైడ్ కి అధికారిక రీమేక్ గా రూపొందిన మిస్టర్ బచ్చన్ నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మాస్ రాజా ఫ్యాన్స్ తో పాటు తెలుగు ప్రేక్షకులు ఈ సినిమా కోసం చాలా ఆసక్తిని కనబర్చారు. విడుదలకు ముందు చేసిన భారీ ప్రచారంతో అన్ని వర్గాల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడంతో పాటు ఆసక్తిని పెంచారు.నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో ఒక సన్నివేశంలో భాగంగా అక్కినేని నాగేశ్వరరావు డాన్స్ మూమెంట్ ను రవితేజ చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఒక సన్నివేశంలో భాగంగా అన్నపూర్ణమ్మ డాన్స్ చేయమని రవితేజ ను అడగడం, అప్పుడు రవితేజ అక్కినేని వారి క్లాసికల్ సాంగ్స్ లో కొన్ని సాంగ్స్ కి డాన్స్ మూమెంట్స్ చేశాడు. ఏ హీరో అయినా ఇతర హీరో కి చెందిన సిగ్నేచర్ స్టెప్స్ ను చేస్తే కచ్చితంగా ఆ స్టెప్స్ వైరల్ అవ్వడం మనం చూస్తూ ఉంటాం. ఈ సినిమాలోని ఆ బిగ్ సాంగ్ స్టెప్స్ కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సోషల్ మీడియాలో ముందు ముందు అప్పుడే రవితేజ చేసిన ఆ స్టెప్స్ వైరల్ అవుతూనే ఉన్నాయి. రవితేజ గతంలో మాదిరిగా వరుసగా సినిమాలు చేయడం, అందులో ఇలాంటి మెరుపులు మెరిపించడం వంటివి చేస్తూ ఉంటే ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సక్సెస్ ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నాడు. ఇటీవలే మరో రెండు సినిమాలకు ఓకే చెప్పాడు. అందులో ఒకటి షూటింగ్ ప్రారంభం కాగా, మరోటి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. ఆ సినిమాకి అనుదీప్ దర్శకత్వం వహించబోతున్నాడనే వార్తలు వస్తున్నాయి. ఇక మిస్టర్ బచ్చన్ సినిమాల విషయానికి వస్తే పవన్ కళ్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాను చేస్తున్నాడు. ఆ సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యింది. కానీ పవన్ రాజకీయాలతో బిజీగా ఉండటం వల్ల ఆ సినిమా మధ్య లో ఉంది. ఈ గ్యాప్ లో రవితేజ తో రైడ్ రీమేక్ ను స్పీడ్ గా చేశాడు. త్వరలోనే పవన్ కళ్యాణ్ సినిమాను పునః ప్రారంభించాలని ఫ్యాన్స్ తో పాటు ఆయన కూడా కోరుకుంటున్నారు. త్వరలోనే సినిమా ప్రకటన ఉంటుందనే వార్తలు వస్తున్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్ లో పవన్ చేత పవర్ ఫుల్ డైలాగ్స్ ను హరీష్ చెప్పించబోతున్నాడని సమాచారం అందుతోంది.

# డిమోంటే కాలనీ 2 తెలుగులో వచ్చేది ఎప్పుడంటే..




తమిళంలో అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కి ప్రేక్షకుల ముందుకొచ్చిన చిత్రం డిమోంటే కాలనీ 2. హర్రర్ కామెడీ జోనర్ లో ఈ సినిమాని దర్శకుడు అజయ్ సిల్వర్ స్క్రీన్ పై ఆవిష్కరించారు. 2015లో వచ్చిన హర్రర్ కామెడీ డిమోంటే కాలనీ సినిమాకి సీక్వెల్ గా ఈ మూవీ వచ్చింది. చియాన్ విక్రమ్ తంగలాన్ కి పోటీగా ఆగష్టు 15న ఈ చిత్రాన్ని తీసుకొచ్చారు. అయితే మొదటి సినిమా సూపర్ హిట్ కావడంతో సీక్వెల్ పైన కూడా భారీ అంచనాలు క్రియేట్ అయ్యి ఉన్నాయి.హర్రర్ కామెడీకి ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఉంటుంది. దీంతో డిమోంటే కాలనీ 2 చిత్రానికి మంచి ఆదరణ లభించినట్లు తెలుస్తోంది. నిజానికి తమిళ్, తెలుగు భాషలలో ఒకే సారి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలని అనుకున్నారు. అయితే ఏవో కారణాల వలన తెలుగు వెర్షన్ ని ప్రేక్షకుల ముందుకి తీసుకొని రాలేకపోయారు. ఇదిలా ఉంటే తాజాగా డిమోంటే కాలనీ 2 తెలుగు వెర్షన్ రిలీజ్ డేట్ ని చిత్ర యూనిట్ కన్ఫర్మ్ చేసింది. ఆగష్టు 23డిమోంటే కాలనీ 2 తెలుగులో వచ్చేది ఎప్పుడంటే.. తమిళంలో అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కి ప్రేక్షకుల ముందుకొచ్చిన చిత్రం డిమోంటే కాలనీ 2. హర్రర్ కామెడీ జోనర్ లో ఈ సినిమాని దర్శకుడు అజయ్ సిల్వర్ స్క్రీన్ పై ఆవిష్కరించారు. 2015లో వచ్చిన హర్రర్ కామెడీ డిమోంటే కాలనీ సినిమాకి సీక్వెల్ గా ఈ మూవీ వచ్చింది. చియాన్ విక్రమ్ తంగలాన్ కి పోటీగా ఆగష్టు 15న ఈ చిత్రాన్ని తీసుకొచ్చారు.